క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



సీతారామస్వామి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొమరాడ: మండలంలోని విక్రంపురంలో విశ్రాంత ఉపాధ్యాయుడు పప్పల సీతారామస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శనివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ తరఫున ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, కన్వీనర్ డి.జనార్దనరావు, శెట్టి మధుసూదనరావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వర్‌రావు, శివిని పీఏసీఎస్ చైర్మన్ దాసరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జీడికి తగ్గిన మార్కెట్ ధర



స్థానిక మార్కెట్లో వ్యాపారులు కొనుగోలు చేసే జీడిపిక్కలు

కురుపాం: ఈ ఏడాది జీడిపిక్కల ధర పడిపోవడంతో గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక మార్కెట్‌లో గత ఏడాది కిలో జీడిపిక్కలు రూ.125 వరకు ధర పలకగా.. ఈ ఏడాది రూ.106 ధర పలుకుతోంది. గతంలో ధర బాగున్నా.. దిగుబడి లేక నష్టపోయేవాళ్లమని, ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికీ మార్కెట్ ధర తగ్గడంతో నష్టాలు తప్పడంలేదని ఏజెన్సీలోని గిరిజన రైతులు వాపోతున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి తక్కువ ధరకు జీడిపిక్కలు కొనుగోలు చేస్తున్నారని అంటున్నారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

భామిని: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. సకాలంలో జీతాలు చెల్లించాలని, వర్క్ టు రూల్ ప్రకారం పని గంటలు అమలు చేయాలని, ఇతర డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.రామయ్య, తహసీల్దార్ నీలాపు అప్పారావు, డీటీలు నిమ్మల శేఖరం, ఆర్.రమేష్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణ లక్ష్యాలు పూర్తిచేయాలి



ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తున్న హౌసింగ్ ఈఈ రమేష్

పాలకొండ రూరల్: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులతో వారికి కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో కృషిచేయాలని హౌసింగ్ ఈఈ రమేష్ అన్నారు. కోమటిపేట సచివాలయం పరిధిలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. అనంతరం సచివాలయంలో హౌసింగ్ ఏఈ మాధవరావుతో కలిసి సిబ్బందితో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయతీలను లబ్ధిదారులకు వివరించడంతో పాటు వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

పనుల్లో ప్రమాణాలు పాటించండి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చేపడుతున్న ఉపాధి పనుల నిర్వహణలో ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మండలంలోని బుక్కూరు గ్రామంలో అమృత్ సరోవర్ కింద చేపడుతున్న చెరువు అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. వేతనదారుల హాజరు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. తాజాగా ప్రభుత్వం సగటు వేతనం రూ.272కు పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పని ప్రదేశం వద్ద తాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

పార్వతీపురం: పెదమరికి గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై పంచాయతీ కార్యదర్శి ఎస్వీ చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేసినట్లు డీపీఓ బి.సత్యన్నారాయణ శనివారం తెలిపారు. అలాగే గ్రామ సర్పంచ్ హెచ్ గంగ చెక్ పవర్‌ను నియంత్రణ చేసినట్లు చెప్పారు.

మహిళలకు ఆర్థిక ఆసరా..



భామిని: సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, మహిళలు

- భామినిలో మిన్నంటిన ఆసరా సంబరాలు
- లబ్ధిదారులకు రూ.3.72 కోట్లు చెక్కు అందజేత

భామిని:

మహిళాభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అందులో భాగంగా వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద మండలంలోని 702 స్వయంశక్తి సంఘాల్లోని 7624 మంది లబ్ధిదారులకు రూ.3.72 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. భామిని మండల పరిషత్ కార్యాలయం వద్ద వైకేపీ ఏపీఎం దొడ్ల భవానీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'వైఎస్సార్ ఆసరా' మూడో విడత సంబరాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇంట్లో ఇల్లాలు సంతోషంగా ఉంటే ఆ కుటుంబం మొత్తం బాగుంటుందని, కుటుంబాలు బాగుంటే సమాజం బాగుంటుందనే ఉద్దేశంతో మన జగనన్న సంక్షేమ పథకాల అమలులో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలను నిలుపుదల చేయకుండా సకాలంలో అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అని అన్నారు. నవరత్నాలతో మనందరి జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చిన జగనన్నకు మనమంతా అండగా నిలబడదామని, మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం లబ్ధిదారులకు ఆసరా చెక్కును అందజేశారు. లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జై జగన్ నినాదాలతో సభ ప్రాంగణం హోరెత్తింది. సీఎం సందేశాన్ని ఏపీఎం భవానీ చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట శాంతికుమారి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు నిమ్మల నీలమ్మ, జెడ్పీటీసీ బొడ్డేపల్లి చిన్నమ్మి, పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, ఎంపీటీసీలు టింగ అన్నాజీరావు, పి.ఉషారాణి, బిడ్డిక తులసీ, పాలక ఉషారాణి, పి.రాంబాబు, బి.బాలకృష్ణ, కోఆప్షన్ మెంబర్ విశ్వనాథ పట్నాయక్, చైర్మన్ గెల్లంకి రమేష్, డైరెక్టర్ కొత్తకోట ఆంజనేయులు, వెలుగు డీపీఎం బి.నారాయణరావు, తహసీల్దార్ ఎస్.అప్పారావు, పలువురు సర్పంచ్‌లు, వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.



భామిని: కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ట్రైనీ ఐఎఫ్‌ఎస్ అధికారుల పర్యటన



ఏకలవ్య పాఠశాలలో వసతులపై ఆరాతీస్తున్న ట్రైనీ ఐఎఫ్‌ఎస్ అధికారులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో శనివారం ఐఎఫ్‌ఎస్ (ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్) శిక్షణ అధికారులు సాహిత్య, అశోక్‌లు పర్యటించారు. ముందుగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. విద్యాప్రమాణాలు, వసతులపై ఆరాతీశారు. గోరటి గిరిశిఖర గ్రామాన్ని సందర్శించి గ్రామంలో డ్వాక్రా మహిళలతో మాట్లాడి, ప్రభుత్వం ద్వారా అందుతున్న ఆర్థిక ప్రోత్సాహం, జీవనోపాధుల కల్పన, వైఎస్సార్ క్రాంతి పథకం ద్వారా అందుతున్న రుణాలు, వాటి సద్వినియోగంపై ఆరాతీశారు. అనంతరం ఇరిడి గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులకు ఆర్బీకేల ద్వారా అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. వారి వెంట ఏపీడీ సత్యంనాయుడు ఉన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనికీలు చేస్తున్న ఎస్సై శివప్రసాద్

పాలకొండ: పట్టణంలోని ప్రధాన రహదారిలో ఎస్సై శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి అపరాద రుసం విధించారు. రోడ్డు భద్రత నిబంధనలపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా, లైసెన్స్ లేకపోయినా, అతి వేగంతో ప్రయాణించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఆలయ పునరుద్ధరణకు నిధులు కేటాయించండి

భామిని: మండలంలోని బత్తిలి మేజర్ పంచాయతీలో ఉన్న పురాతన నీలకంఠేశ్వరాలయ పునరుద్ధరణకు దేవాదాయశాఖ నుంచి నిధులు కేటాయించేలా చూడాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, మండల కోఆప్షన్ సభ్యుడు విశ్వానాథ పట్నాయక్, పార్టీ నాయకులు శివ్వాల తిరుపతిరావు ఆధ్వర్యంలో గ్రామ యువకులు శనివారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉపాధి హామీ పనులపై ఎమ్మెల్యే సమీక్ష



ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: సీతంపేట మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులపై ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి వండవ క్యాంపు కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే పనులను ప్రాధాన్యత ఇవ్వాలని, జాబ్‌కార్డు ఉన్న ప్రతీ వేతనదారునికి పని కల్పించాలన్నారు. సమావేశంలో సీతంపేట ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ, ఏపీఓలు సాగర్, బాబురావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యాలు పూర్తి చేయండి

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: గృహ నిర్మాణాల లక్ష్యాలను కచ్చితంగా పూర్తి చేయాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, సాలూరు హౌసింగ్ ప్రత్యేక అధికారి సి. విష్ణుచరణ్ అన్నారు. సాలూరు మున్సిపాలిటీ, మండలంలో జరుగుతున్న గృహనిర్మాణాలపై శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గృహనిర్మాణాలను వేగవంతం చేసేందుకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు రోజువారీ ప్రాతిపదికన లక్ష్యాలను నిర్ణయించారు. గృహ నిర్మాణాలు మొదలుపెట్టేలా లబ్ధిదారులను చైతన్యవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ హెచ్. శంకరరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, అర్బన్, రూరల్ గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజినీర్, ఇంజినీరింగ్ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిబిరం

పాలకొండ రూరల్: నియోజకవర్గ కేంద్రం పాలకొండలో మే ఒకటో తేదీ నుంచి ముప్పై రోజుల పాటు వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు పీడీ వి.పుష్పనాథం తెలిపారు. సమ్మర్ క్యాంప్ వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. 8 నుంచి 16 సంవత్సరాల మధ్య వయసున్న బాలబాలికలు వారికి ఆసక్తి ఉన్న క్రీడల్లో నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9908689050 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు

వీరఘట్టం: స్థానిక గర్ల్స్ హైస్కూల్‌లో ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పరీక్షల కేంద్రాన్ని కేటాయించినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ దూసి నాగమణి శనివారం తెలిపారు. ఈనెల 3 నుంచి 17 వరకు జరిగే ఈ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. పాలకొండ డివిజన్‌లోని ఏడు మండలాలకు చెందిన ఓపెన్ ఇంటర్ విద్యార్థులు వీరఘట్టం కేంద్రంలో పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి, అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

త్వరితగతిన సర్వేరాళ్ల ఏర్పాటు

పాలకొండ: జగనన్న భూరక్ష–భూసర్వేలో భాగంగా సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో సరిహద్దు రాళ్ల త్వరితగతిన ఏర్పాటు చేయాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు తెలిపారు. మండలంలోని వీఆర్వోలు, గ్రామీణ సర్వేయర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. సర్వే పూర్తయిన గ్రామాల వారిగా సర్వే రాళ్ల ఏర్పాటుపై సిబ్బందికి సూచనలు చేశారు. రైతుల సమక్షంలోనే రాళ్లు వేయించాలన్నారు.న ఆయనతో పాటు డీటీ బి.బుచ్చయ్య ఉన్నారు.

పొట్టేళ్ల పందేలపై పోలీసుల దాడి

పాలకొండ రూరల్: మండలంలోని యరకారాయపురంలో నిర్వహిస్తున్న పొట్టేళ్ల పందేలపై శనివారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పందెంలో నిలిపిన రెండు పొట్టేళ్లతో పాటు రూ.4 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి.శివప్రసాద్ తెలిపారు. పందేలు నిర్వహిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సొలికిరిలో పారిశుద్ధ్య పనులు



పూడికతీత పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీటీసీ చంద్రశేఖర్, సర్పంచ్ ప్రభాకర్

భామిని: సొలికిరి గ్రామంలో శనివారం పరిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధికాలువల్లో పూడికలు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. తాగునీటి బావులు, బోర్లను క్లోరినేషన్ చేశారు. ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ పనులను పర్యవేక్షించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

రీసర్వేకు ప్రజలు సహకరించాలి



పాలమెట్ట గ్రామ మ్యాప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

వీరఘట్టం: గ్రామాల్లో చేపడుతున్న రీ–సర్వేకు ప్రజలంతా సహకరించాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ కోరారు. మండలంలోని అడారు, పాలమెట్ట గ్రామాల్లో శనివారం రీ–సర్వేపై నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్వేకు సంబంధించి రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

లబ్ధిదారులకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి
- కొమరాడలో ఆసరా సంబరాలు
- భారీగా తరలివచ్చిన మహిళలు

కొమరాడ:

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమల చేస్తున్నారని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. కొమరాడలో శనివారం జరిగిన 'వైఎస్సార్ ఆసరా' మూడో విడత సంబరాల్లో ఆమె పాల్గొని లబ్ధిదారులకు ఆసరా చెక్కును అంద జేశారు. ముందుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేస్తామని చెప్పి మహిళలను మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు పసుపు–కుంకుమ పేరుతో పదివేల రూపాయ లు ఇచ్చి మహిళలను బ్యాంకుల చుట్టూ తిప్పిన ఘనత చంద్రబాబుదే అన్నారు. మహిళల సంక్షేమ మే ధ్యేయంగా జగనన్న పనిచేస్తున్నారని, అమ్మ ఒ డి, చేయూత, ఆసరా, సున్నావడ్డీ, తదితర పథకాల తో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళలంతా జగనన్నకు అండగా నిలవాలని కోరారు. మండలంలో 854 సంఘాల్లోని 9693 మంది సభ్యులకు గాను రూ.4.30 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి.జనార్దనరావు, శెట్టి మధుసూదనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు, ఏపీఎం భారతి, సీసీ వెంకటరమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన మహిళలు

విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

గరుగుబిల్లి: పదోతరగతి పరీక్షలు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపపట్టినట్లు ఎంఈఓ ఎస్.నాగభూషణరావు తెలిపారు. మండలంలోని రావివలస, గరుగుబిల్లిలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈనెల 3 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గరుగుబిల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 117 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో 147మంది, రావివలస జెడ్పీహెచ్ఎస్‌లో 197మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు సీసీ కెమేరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



బిటివాడ పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన బెంచీలు

వీరఘట్టం: ఈనెల 3 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ పర్రి కృష్ణమూర్తి శనివారం తెలిపారు. గంగమ్మపేట ఆశ్రమ పాఠశాలలో 113 మంది, బిటివాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 146 మంది, నీలానగరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 133 మంది, వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 153 మంది, వీరఘట్టం గర్ల్స్ హైస్కూల్‌లో 190తో కలిపి ఈ ఐదు పరీక్ష కేంద్రాల్లో 735 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ప్రతీ గదిలో 24 మంది విద్యార్థులు పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేసామన్నారు. కేంద్రాల్లో తాగునీరు, బెంచీలు, ఫ్యాన్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

యోగాతో ఆరోగ్య రక్షణ



యోగాసనాలు వేస్తున్న ఔత్సాహికులు

పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా యోగాసనాలు సాధన చేయడం ద్వారా దీర్ఘకాల ఆరోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చని యోగా శిక్షకులు కె.జనార్దనరావు అన్నారు. రుషి యోగా కేంద్రంలో శనివారం ప్రత్యేక యోగా శిబిరం నిర్వహించారు. ఆసనాల ఆవశ్యకత, వాటివలన కలిగే ప్రయోజనాలపై ఔత్సాహికులకు అవగాహన కల్పించారు. అలాగే అమృత ఆహార స్వీకరణ, సూర్య నమస్కారాలు, వేకువజాము నడక వలన శరీరంలో నూతన తేజస్సు, ఉత్సాహం కలుగుతుందన్నారు.

అలరించిన కోలాటం



కోలాటం ఆడుతున్న మహిళలు

భామిని: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బాలేరు కోదండ రామాలయం ప్రాంగణంలో శనివారం నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. మహిళలు భక్తిగీతాలు ఆలపిస్తూ కోలాటం ఆడారు. కొత్తూరు కళింగ వైశ్య సంఘం మహిళా విభాగం, బాలేరు–సొలికిరి, దిమ్మిడిజోల, ఘనసర గ్రామాలకు చెందిన మహిళలు కోలాట ప్రదర్శన ఇచ్చారు. అంతకుముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

మాతాశిశు ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం

సీతానగరం: జిల్లాలో మాతాశిశు ఆరోగ్య భద్రతకు వైద్య సిబ్బంది అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐఓ) అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని కె.ఎస్.పురం, చినబోగిలి, పెదబోగిలి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన తల్లీబిడ్డల సంరక్షణ కార్డులు, పిల్లల టీకా కార్డుల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫోలిక్‌యాసిడ్ మాత్రలు, ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు, పౌష్టికాహారం ద్వారా రక్తహీనతను నివారించవన్నారు. పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్, సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపరువైజరు కె.సత్యవతి, జయాగౌడ్, అంగన్‌వాడీ టీచర్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.